సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

SK1 one NEWS HD

www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com

# సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY

జాతీయ తెలుగు దినపత్రిక

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.

PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 160 | పేజీలు : 04, వెల రూ. 2 రూ/ | శనివారం 29-08-2026


## అర్హులైన పేదలకు నిష్పక్షపాతంగా ఇందిరమ్మ ఇళ్లు




- మంత్రి పొంగులేటి హామీ
- జీహెచ్ఎంసీ పరిధిలో లాటరీ పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక
- మొదటి విడతలో 7,350 ఇళ్ల కేటాయింపు ప్రక్రియ
- 10 రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల జాబితా వెల్లడి
- విలువైన భూముల్లోనూ పేదల కోసం ఇళ్ల నిర్మాణం

## వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద డ్రామా నడిపింది



- తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత
- సింగరేణి కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందన్న కవిత
- అనారోగ్యంతో బాధపడుతున్న కార్మిక కుటుంబాలకు న్యాయం చేయడం లేదని మండిపాటు
- ప్రతి సింగరేణి కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని హెచ్చరిక

**హైదరాబాద్ :**

కష్టపడి పనిచేసే సింగరేణి కార్మికుల సంక్షేమంపై కాంగ్రెస్ సర్కార్ తీవ్రమైన అలసత్వాన్ని ప్రదర్శిస్తోందని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల - మిగతా 2 లో

## రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు గట్టిగా వాదించండి

- నీటిపారుదలశాఖ సమీక్షలో సీఎం దిశానిర్దేశం
- అంతర్రాష్ట్ర నదీజలాల వివాదాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- సుప్రీంకోర్టు, సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీలో వాదించాల్సిన అంశాలపై సమీక్ష
- మహారాష్ట్ర, ఏపీతో వివాదాలపై అధికారులు, న్యాయవాదులు తెలంగాణ వైఖరిని స్పష్టం చేయాలని ఆదేశం



**హైదరాబాద్ :**

అంతర్రాష్ట్ర జల వివాదాలపై వివిధ వేదికలపై రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా గట్టిగా వాదించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. సెప్టెంబరు 1న తుమ్మిడిహట్టిపై దిల్లీలో జరగనున్న అధికారుల భేటీ, సెప్టెంబరు 7న సీడబ్ల్యూసీ హైలెవెల్ కమిటీ సమావేశ ఎజెండాపై చర్చించినట్లు తెలుస్తోంది. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నీటిపారుదల శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. మహారాష్ట్ర, ఏపీతో వివాదాలపై అధికారులు, న్యాయవాదులు తెలంగాణ వైఖరిని స్పష్టం చేయాలని సీఎం సూచించినట్లు సమాచారం. సుప్రీంకోర్టు, కేంద్ర జలవనరుల సంఘం, కృష్ణా, గోదావరి నదీ జలాల నిర్వహణ బోర్డుల్లో ఉన్న వివిధ కేసులపై సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చర్చించారు. కేసులు ఏ దశలో ఉన్నాయి, ఇతర రాష్ట్రాల వాదనలేంటి, తెలంగాణ ప్రయోజనాలు వంటి అంశాలపై సీఎం ఆరా తీసినట్లు సమాచారం. సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. - మిగతా 2 లో

## అమరావతిలో క్వాంటమ్ యూనివర్సిటీ!

- అమరావతిలో దేశపు తొలి క్వాంటమ్, ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు
- రూ.730.7 కోట్ల ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం, కేంద్రం నిధులు
- సెప్టెంబర్ 2026 నుంచి తొలి విద్యా కార్యక్రమాలు ప్రారంభం
- క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీకండక్టర్ రంగాల్లో కోర్సులు, పరిశోధనలు
- పరిశోధనలను వాణిజ్య ఉత్పత్తులుగా మార్చడమే అసలైన సవాల్
- కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న “నేషనల్ క్వాంటమ్ మిషన్”



**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మరో చారిత్రక మైలురాయిని అందుకోబోతోంది. భవిష్యత్ సాంకేతికతకు చిరునామాగా నిలిచే కీలక ప్రాజెక్టుకు వేదిక కానుంది. దేశంలోనే మొట్టమొదటిసారిగా క్వాంటమ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీలకు అంకితమైన పూర్తిస్థాయి యూనివర్సిటీ క్యాంపస్‌ను అమరావతిలో ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధమైంది. ఈ మెగా ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా ఆమోదముద్ర వేసింది. ఈ పరిణామంపై ఎన్డీటీవీ మీడియా సంస్థ విస్తృతమైన, విశ్లేషణాత్మక కథనం వెలువరించింది. ఈ ప్రాజెక్టు వివరాల్లోకి వెళితే, మొత్తం రూ.730.7 కోట్ల అంచనా వ్యయంతో ఈ యూనివర్సిటీ క్యాంపస్‌ను నిర్మించనున్నారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తుంది. ఐదేళ్ల కాలానికి అవసరమైన పూర్తి - మిగతా 2 లో

## ఒంగోలులో మహనీయుల స్ఫూర్తి



- 20 విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రి లోకేశ్
- జిల్లా సంస్కృతికి ప్రతీకగా ఒంగోలు గిత్త విగ్రహం ఆవిష్కరణ
- మహనీయుల సేవలను భావితరాలకు తెలియజేయడమే లక్ష్యమన్న లోకేశ్
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు
- వివిధ రంగాలకు చెందిన మహనీయుల విగ్రహాలను ఒకే చోట ఏర్పాటు

**అమరావతి :**

సమాజానికి వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మహనీయుల సేవలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను భావితరాలకు అందించాలనే ఉన్నత లక్ష్యంతో ఒంగోలు నగరంలో భారీ కార్యక్రమం - మిగతా 2 లో





## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు

- మంగళగిరిలోని అరణ్యభవన్ లో బాధ్యతలు స్వీకరించిన నాగబాబు
- కేబినెట్ హోదాతో గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ పదవి
- బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న నాగబాబు అర్ధాంగి పద్మజ

**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా ప్రముఖ నటుడు, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు బాధ్యతలను స్వీకరించారు. మంగళగిరిలోని అరణ్యభవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తన భార్య పద్మజతో కలిసి పాల్గొన్న ఆయన... వేదపండితుల మంత్రోచ్ఛారణలు, ప్రత్యేక పూజల నడుమ పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు. రాష్ట్ర పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ‘ఏపీ గ్రీన్’ ప్రాజెక్టును - మిగతా 2 లో



## అమెరికా నుంచి ‘ఫైర్ అండ్ ఫర్గెట్’ జావెలిన్ క్షిపణుల కొనుగోలుకు భారత్ మొగ్గు

- జావెలిన్ యాంటీ ట్యాంక్ క్షిపణి వ్యవస్థలను కొనుగోలు చేయడానికి సిద్ధమవుతున్న భారత్
- ఆటోమేటెడ్ గైడెన్స్ మెకానిజంతో పని చేసే జావెలిన్ క్షిపణులు
- భారత సైనిక రంగానికి భారీ ఊతం ఇవ్వనున్న అత్యాధునిక క్షిపణులు

**ఢిల్లీ :**

సైనిక సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా భారత్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికా నుంచి అత్యాధునిక ‘ఫైర్ అండ్ ఫర్గెట్’ సాంకేతికత కలిగిన ‘జావెలిన్’ (జీఖజవశ్రీఱఅ) యాంటీ ట్యాంక్ క్షిపణి వ్యవస్థలను కొనుగోలు చేయడానికి భారత్ సిద్ధమవుతోంది. భారత సాయుధ దళాల ఆధునికీకరణలో భాగంగా ఈ ప్రతిపాదిత రక్షణ ఒప్పందం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. భుజంపై నుంచి ప్రయోగించే ఈ జావెలిన్ క్షిపణి వ్యవస్థ ఆటోమేటిక్ గైడెన్స్ మెకానిజంతో పనిచేస్తుంది. దీనివల్ల క్షిపణిని ప్రయోగించిన తర్వాత అది టార్గెట్‌ను స్వయంగా గుర్తించి దెబ్బతీస్తుంది. అదే సమయంలో, - మిగతా 2 లో

## నేపాల్‌లో జల ప్రళయం 547కి చేరిన మృతుల సంఖ్య



- నేపాల్‌లో ఆకస్మిక వరదలు
- వందల మంది గల్లంతు, కొనసాగుతున్న గాలింపు చర్యలు
- భోటేకోషి నదిలో పెరుగుతున్న నీటిమట్టంతో సహాయక చర్యలకు ఆటంకం
- హిమానీనదం కూలడమే ఈ పెను విపత్తుకు కారణమని అనుమానం
- నేపాల్, చైనాతో పాటు పలు దేశాలు సహాయక చర్యల్లో భాగస్వామ్యం

**ఢిల్లీ :**

నేపాల్–టిబెట్ సరిహద్దులోని హిమాలయ ప్రాంతంలో సంభవించిన ఆకస్మిక వరదలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ జల ప్రళయంలో నేపాల్‌లో మరణించిన వారి సంఖ్య 547కి పెరిగినట్లు అధికారులు ధృవీకరించారు. వందలాది మంది ఇప్పటికీ గల్లంతయ్యారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. భోటేకోషి నదిలో నీటిమట్టం ప్రమాదకర స్థాయిలో పెరుగుతుండటంతో మళ్లీ వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ఈ కారణంగా సహాయక బృందాలు అత్యంత జాగ్రత్తగా ముందుకు సాగుతున్నాయి. రసువా జిల్లాలో - మిగతా 2 లో

## అంబటి రాంబాబుకు అస్వస్థత




- స్టెంట్ వేసిన వైద్యులు
- అస్వస్థతకు గురైన మాజీ మంత్రి అంబటి రాంబాబు
- హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో ప్రత్యేక చికిత్స
- ఆందోళన వద్దని స్పష్టం చేసిన వైద్యులు


## తమిళనాడు అసెంబ్లీలో అరుదైన దృశ్యం

- మంత్రుల సీట్లలోకి సీఎం విజయ్!
- అసెంబ్లీలో దీర్ఘకాల సంప్రదాయాన్ని పక్కనపెట్టిన సీఎం విజయ్
- ఒక ముఖ్యమంత్రి ఇలా చేయడం ఇదే తొలిసారి అని చెబుతున్న సభా వర్గాలు




## ‘నిప్పుతో చెలగాటం ఆడొద్దు’ బ్రిటన్‌కు రష్యా స్ట్రాంగ్ వార్నింగ్

- ఉక్రెయిన్‌కు బ్రిటన్ క్షిపణి టెక్నాలజీ
- దీనిపై తీవ్రంగా స్పందించిన రష్యా
- బ్రిటన్ సైనిక స్థావరాలపై దాడి చేస్తామంటూ సంకేతాలు
- బ్రిటన్, ఫ్రాన్స్ ‘నిప్పుతో చెలగాటం’ ఆడుతున్నాయని వ్యాఖ్య
- ఉక్రెయిన్‌లో స్టార్మ్ షాడో తయారీకి మార్గం సుగమం



**ఢిల్లీ :**

ఉక్రెయిన్‌కు బ్రిటన్ అందిస్తున్న సైనిక సాయం మరింత పెరగడంపై రష్యా తీవ్రంగా స్పందించింది. బ్రిటన్, ఫ్రాన్స్ తీరు ప్రమాదకరంగా మారుతోందని హెచ్చరించింది. తమ దేశానికి చెందిన స్టార్మ్ షాడో క్షిపణులను ఉక్రెయిన్‌లోనే తయారు చేసుకునేలా బ్రిటన్ - మిగతా 2 లో

# సంపాదకీయం

## ఈ విలయం ఎవరి పాపం?

హిమవత్పర్వత శ్రేణి రాళ్లూ రప్పల సమూహం కాదు... అది ప్రకృతి చెక్కిన ఒక అద్భుత దృశ్యకావ్యం. ఈ సౌందర్యం కాస్తా రెప్పపాటులో మృత్యుగీతం ఆలపిస్తుంది. జనావాసాలను క్షణంలో శ్మశాన వాటికలుగా మారుస్తుంది. బుధవారం నేపాల్--టిబెట్ సరిహద్దుల్లో అతి పెద్ద మంచుఖండం విరిగి భోటే కోశీ నదిలో పడటంతో మెరుపు వరదలు సంభవించి 350 మంది వరకూ మరణించారని అంటున్నారు. 30కిపైగా దేశాలకు చెందిన 1,300 మంది గల్లంతయ్యారు. వారిలో 290 మంది భారతీయులు. నది దిగువనవున్న అనేక జనావాసాలు, డజను జలవిద్యుత్ ప్రాజెక్టులు, వంతెనలు, రహదార్లు కొట్టుకు పోయాయి. హిమాలయాల్లో ఇలాంటి ఉదంతాలు రివాజుగా మారినా, ఈసారి ఉత్పాతం అతి పెద్దదని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. ఈ దారుణానికి కారణమేమిటో స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. రిక్టర్ స్కేల్‌పై 4.4 తీవ్రతతో భూకంపం సంభవించటంవల్లే ఇలా జరిగిందని తొలుత వార్తలొచ్చాయి. అయితే దాన్ని నిర్ధారించే ఉపగ్రహ చిత్రాలేమీ లేకపోవటంతో తీవ్ర వాతావరణ స్థితిగతులవల్లే మంచుఖండం కరిగి విరిగిపడి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.వాతావరణంలో కర్బన ఉద్గారాలు పెరగటంవల్ల భూమి నానాటికీ వేడెక్కుతోంది. కాలుష్యకారక దేశాల్లో తొలి స్థానం అమెరికాది. అటు తర్వాత స్థానం చైనాది కాగా, మూడో స్థానం మనది. నాలుగో స్థానం యూరోప్ దేశాలది. కర్బన ఉద్గారాల విడుదలలో నేపాల్ స్థానం 95. అంటే ప్రపంచాన విడుదలయ్యే కర్బన ఉద్గారాల్లో ఒక శాతంలో పదో వంతు వాటా మాత్రమే నేపాల్‌ది. వాతావరణ మార్పుల తాకిడికి నష్టపోయే దేశాల్లో మాత్రం ఆ దేశానిది ఆరో స్థానం. అతి తక్కువ కాలుష్యానికి కారణమవుతూ అతి ఎక్కువ మూల్యం చెల్లిస్తున్న దేశంగా నేపాల్‌ను చెబుతారు. ఇప్పుడంటే సూపర్ ఎల్‌నినో వచ్చిపడిందిగానీ... గత దశాబ్దకాలంగా ప్రకృతి వైపరీత్యాలు వేధిస్తూనే ఉన్నాయి. వాటిని ముందుగా పసిగట్టే సాంకేతికతలు అనుకున్నంతగా అభివృద్ధి చెందకపోయినా, గతంతో పోలిస్తే ఎంతో మెరుగైన ఉపకరణాలు అమెరికా, చైనాలవద్ద ఉన్నాయి. తమ కారణంగా యేటా భారీ నష్టాన్ని చవిచూస్తున్న నేపాల్‌కు ఆ సాంకేతికతల్ని ఉచితంగా ఇచ్చి ఆదుకోవటం తమ నైతిక ధర్మమని అవి రెండూ అనుకోవు. ఫలితంగా చెప్పాపెట్టకుండా మెరుపు వరదలు విరుచుకుపడటం నేపాల్‌లో మామూలు విషయంగా మారింది.భోటే కోశి నది టిబెట్‌లో మొదలవుతుంది. కొడారి దగ్గర ఒక పాయ, రసువా దగ్గర మరో పాయ నేపాల్‌లోకి ప్రవేశిస్తాయి. నిరుడు సైతం ఆ నదికి ఇలాగే వరదలొచ్చాయి. గత నెల 8న రసువా దగ్గరొచ్చిన వరదల్లో 18 మంది చనిపోగా, అనేక జలవిద్యుత్ ప్రాజె క్టులు, వంతెనలు, విద్యుత్ పంపిణీ వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. వర్షపాతం, వరదనీటి ప్రవాహాల గురించిన డేటా చైనా ఎప్పటికప్పుడు అందిస్తే ప్రాణనష్టాన్ని నివారించే వీలుంటుంది. దేశంలోకి వరద నీరు ప్రవేశించటం మొదలయ్యాకే పౌరుల్ని హెచ్చరించే స్థితి ఉండటం నేపాల్‌కి విషాదం మిగులుస్తోంది. కొన్నిసార్లు మంచుపలకలు విరిగి భోటే కోశి ప్రవాహ మార్గాన్ని కప్పేస్తాయి. అప్పుడు దిగువన నేపాల్‌లో నది నిండుకుంటుంది. దాన్నొక ముందస్తు హెచ్చరికగా తీసుకుంటారు. ఇలాంటి వైపరీత్యాలు జరిగినప్పుడు మౌలిక సదుపాయాల పునర్నిర్మాణం తప్పదు. నిరుడు బేత్రావతి--రసువాగడి కారిడార్‌ను వరదలు ముంచెత్తి భారీ నష్టం జరిగింది.అతి కష్టంపై వాటన్నిటినీ పునర్నిర్మించారు. అవన్నీ తాజా వరదల్లో మళ్లీ కొట్టుకు పోయాయి. పదిపదిహేనేళ్ల డేటా అందుబాటులో ఉండి అధ్యయనం చేయగలిగితే నది నడత అంచనాకు, దానికి అనుగుణంగా కనిష్ఠ స్థాయి నష్టం మాత్రమే ఉండేలా నిర్మాణాలు చేపట్టడానికి కొంతవరకూ వీలవుతుంది. భారీ జననష్టం, ఆస్తినష్టం కలగజేసే వైపరీత్య సమాచారం సైతం సరిహద్దుల ఆవలే నిలిచిపోతే మానవాళి సాధించిన అభివృద్ధికి అర్థం ఉండదు. దానికన్నా ముందు సంపన్న దేశాలు తమ అభివృద్ధి నమూనాలను మార్చుకోవాలి. వైపరీత్యం వచ్చిపడ్డాక సాయం చేయటానికి ముందుకు రావటం మెచ్చదగిందే అయినా, దాని నివారణకు తమ వంతు చేయాల్సిందేమిటో అవి గుర్తెరగాలి. బాధ్యతారహిత ప్రవర్తన ఏదో ఒకరోజు తమను కూడా ధ్వంసించగలదని తెలుసుకోవాలి.

## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు

**మొదటిపేజీ తరువాయి -** ముందుకు నడిపేందుకు నాగబాబుకు ఈ కీలక బాధ్యతలను అప్పగించారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అటవీ, పచ్చదనం శాతాన్ని ఏకంగా 50 శాతానికి పెంచాలనే భారీ లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను వేగవంతం చేసేందుకు గాను నాగబాబుకు కేబినెట్ హోదా హోదాతో కూడిన బాధ్యతలను అప్పగించింది.బాధ్యతలు స్వీకరించిన అనంతరం నాగబాబును పలువురు ఐఏఎస్ అధికారులు, అటవీ శాఖ సీనియర్ అధికారులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మర్యాదపూర్వకంగా కలిశారు. పీసీసీఎఫ్ చలపతిరావు, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజలతో పాటు ఇతర ప్రభుత్వ సలహాదారులు, ప్రముఖులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.


## అమెరికా నుంచి 'ఫైర్ అండ్ ఫర్గెట్' జావెలిన్ క్షిపణుల కొనుగోలుకు భారత్ మొగ్గు

**మొదటిపేజీ తరువాయి -** క్షిపణి ప్రయోగించిన సైనికుడు శత్రువుల దాడి నుంచి తప్పించుకోవడానికి లేదా సురక్షిత ప్రాంతంలో తలదాచుకోవడానికి తగిన సమయం లభిస్తుంది.ఎత్తైన పర్వత ప్రాంతాలు, సరిహద్దు వద్ద శత్రుదేశాల ట్యాంకులు, సాయుధ వాహనాలను సమర్థవంతంగా అడ్డుకోవడానికి ఈ జావెలిన్ క్షిపణులు అత్యంత ప్రభావవంతంగా పనిచేస్తాయి. భారత సరిహద్దుల్లో రక్షణను మరింత కట్టుదిట్టం చేసేందుకు అమెరికాతో జరుగుతున్న ఈ రక్షణ ఒప్పందం భారత్ సైనిక రంగానికి సాంకేతికంగా పెద్ద ఊతాన్ని ఇవ్వనుంది.

## అంబటి రాంబాబుకు అస్వస్థత

**మొదటిపేజీ తరువాయి -** వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన్ను హుటాహుటిన హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వైద్యులు ఆయనకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, స్టెంట్ అమర్చారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు స్పష్టం చేశారు.వివరాల్లోకి వెళితే, శుక్రవారం అంబటి రాంబాబు అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం వెంటనే హైదరాబాద్‌కు తరలించారు. అక్కడి అపోలో ఆసుపత్రిలో చేరిన వెంటనే వైద్య బృందం ఆయనకు పలు వైద్య పరీక్షలు నిర్వహించింది. యాంజియోగ్రామ్ చేసి, ఆయనకు స్టెంట్ వేయాలని నిర్ణయించారు. ఆ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు.ప్రస్తుతం అంబటి రాంబాబు వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో ఉన్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ప్రమాదం ఏమీ లేదని డాక్టర్లు వెల్లడించారు. ఈ వార్త తెలియగానే వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే, ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు ప్రకటించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## 'నిప్పుతో చెలగాటం ఆడొద్దు' బ్రిటన్‌కు రష్యా స్ట్రాంగ్ వార్నింగ్



**మొదటిపేజీ తరువాయి -** సాంకేతిక పరిజ్ఞానం అందించనుంది. ఈ నిర్ణయం యుద్ధాన్ని మరింత తీవ్రం చేసే అవకాశం ఉందని రష్యా ఆందోళన వ్యక్తం చేసింది.రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా బ్రిటన్, ఫ్రాన్స్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాలు 'నిప్పుతో చెలగాటం ఆడుతున్నాయి' అని హెచ్చరించారు. బ్రిటన్ ఆయుధాలతో జరిగే దాడులకు ప్రతిస్పందన తప్పదని స్పష్టం చేశారు.ఉక్రెయిన్‌లోనే స్టార్మ్ షాడో క్షిపణులను తయారు చేసుకునే సాంకేతికతను బ్రిటన్ ఇవ్వనుందని లండన్ ప్రకటించింది. దీంతో పాశ్చాత్య దేశాల నుంచి క్షిపణుల సరఫరాపై ఉక్రెయిన్ ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. సుదూర ప్రాంతాల్లో దాడులు చేసే సామర్థ్యం పెరుగుతుంది.బ్రిటన్ ఆయుధాలతో జరిగే దాడులకు ప్రతిగా ఉక్రెయిన్‌లోనే కాకుండా ఇతర ప్రాంతాల్లో ఉన్న బ్రిటన్ సైనిక స్థావరాలపైనా దాడులు జరిగే అవకాశం ఉందని జఖరోవా హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు బ్రిటన్-రష్యా మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశం ఉంది.ఇదే సమయంలో రష్యా-నాటో మధ్య ఉద్రిక్తతలపైనా చర్చ జరుగుతోంది. రష్యా నాటో సభ్యదేశంపై పరిమిత దాడికి ప్రయత్నించే అవకాశం ఉందన్న అమెరికా నిఘా అంచనాలపై వార్తలు వచ్చాయి. అయితే ఈ ఆరోపణలను రష్యా ఖండించింది. నాటోతో తలపడేందుకు తమ దేశం సిద్ధమవుతోందన్న ప్రచారంలో వాస్తవం లేదని క్రెమ్లిన్ స్పష్టం చేసింది.

# నేపాల్‌లో జల ప్రళయం.. 547కి చేరిన మృతుల సంఖ్య



**మొదటిపేజీ తరువాయి -** వరదల నుంచి ప్రాణాలతో బయటపడిన కస్టమ్స్ ఏజెంట్ రాజు బుధతోకి మాట్లాడుతూ, "భూమి ఒక్కసారిగా కంపించినట్లు అనిపించింది. కళ్ళు తెరిచేలోపే వరద నీరు ఉవ్వెత్తున ఎగిసిపడి ఇళ్లను తుడిచిపెట్టేసింది. ఈ ప్రమాదం నుంచి బయటపడటం నాకు పునర్జన్మ లాంటిది" అని ఆ భయానక క్షణాలను గుర్తుచేసుకు న్నారు.ఈ విపత్తు ప్రభావం చైనా వైపున ఉన్న టిబెట్‌పైనా తీవ్రంగా పడింది. నేపాల్ సరిహద్దులోని పోర్టు వద్ద సంభవించిన వరదల్లో ఐదుగురు మరణించగా, 260 మంది విదేశీయులతో సహా 558 మంది గల్లంతయ్యారని చైనా అధికారులు ప్రకటించారు. ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కమ్యూనిస్ట్ పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించి సహాయక చర్యలపై సమీక్షించారు. నేపాల్‌లోని ఎత్తైన హిమానీనదం (గ్లేసియర్) ఒకటి కూలిపోవడం వల్లే ఈ విపత్తు సంభవించి ఉండవచ్చని చైనా ప్రాథమికంగా అంచనా వేస్తోంది.ఖాట్మండులోని శాస్త్రవేత్తలు కూడా ఇదే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. హిమానీనదం కూలిపోవడం, మంచు-రాళ్ల చరియలు విరిగిపడటంతో లెండే నదికి తాత్కాలికంగా ఆనకట్టలా అడ్డుపడిందని, అది ఒక్కసారిగా తెగిపోవడంతో, అక్కడ్నించి భోటేకోషి నదిలోకి ఈ స్థాయిలో వరద ప్రవాహం దూసుకొచ్చిందని భావిస్తున్నారు.ఈ పెను విషాదంపై అంతర్జాతీయ సమాజం స్పందిస్తోంది. నేపాల్ ప్రధాని బాలేంద్ర షా, ఆయన కేబినెట్ మంత్రులు తమ ఒక నెల జీతాన్ని విపత్తు సహాయ నిధికి విరాళంగా ప్రకటించారు. ఖాట్మండులోని మహాకాళ్ శని భగవాన్ ఆలయంలో బాధితుల ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న భారత పర్యాటకులను భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ కలిసి ధైర్యం చెప్పారు. యునైటెడ్ కింగ్‌డమ్ 5 మిలియన్ పౌండ్ల ఆర్థిక సహాయంతో పాటు, అత్యవసర సహాయక బృందాలను పంపడానికి ముందుకొచ్చింది. గల్లంతైన వారిలో సుమారు 33 మంది బ్రిటిష్ పౌరులు ఉన్నట్లు సమాచారం. సరిహద్దుల్లో అంతర్జాతీయ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# అమరావతిలో క్వాంటమ్ యూనివర్సిటీ!

**మొదటిపేజీ తరువాయి -** నిధులను కేంద్ర ప్రభుత్వమే గ్రాంట్ల రూపంలో సమకూర్చడం ఈ ప్రాజెక్టు యొక్క ప్రత్యేకత. అమరావతిలో 8.5 ఎకరాల విస్తీర్ణంలో ఈ అత్యాధునిక క్యాంపస్‌ను నిర్మించనున్నారు.కేవలం విద్యకే పరిమితం కాకుండా విద్య, పరిశోధన, సెమీకండక్టర్ టెక్నాలజీ, స్టార్టప్‌ల ప్రోత్సాహం, అధునాతన నైపుణ్యాల కల్పన వంటి బహుళ లక్ష్యాలతో ఈ సంస్థను ఏర్పాటు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "నేషనల్ క్వాంటమ్ మిషన్", "ఇండియా ఏఐ మిషన్", "ఇండియా సెమీకండక్టర్ మిషన్" వంటి కీలక కార్యక్రమాలకు అనుగుణంగా ఈ యూనివర్సిటీ పనిచేస్తుంది. పరిశోధనలను వాణిజ్య ఉత్పత్తులుగా మార్చేందుకు ఒక కీలక కేంద్రంగా (హబ్) దీనిని తీర్చిదిద్దనున్నారు.ఈ క్యాంపస్‌లో సుమారు 1.25 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ క్వాంటమ్ రీసెర్చ్, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ బ్లాక్‌ను నిర్మించనున్నారు. ఇందులో క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్, క్వాంటమ్ సెక్యూరిటీ, క్వాంటమ్ ఫోటోనిక్స్, క్రయోజెనిక్ సిస్టమ్స్, హై-పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్, క్లీన్‌రూమ్‌లు, నానో-ఫ్యాబ్రికేషన్, సెమీకండక్టర్/చిప్-డిజైన్ ల్యాబ్‌లు, డేటా సెంటర్లు, స్టార్టప్‌ల కోసం ప్రత్యేక స్పేస్ వంటి ప్రపంచ స్థాయి సౌకర్యాలు ఉంటాయి.ఇక్కడ అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డాక్టోరల్, డిప్లొమా, ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లను అందించనున్నారు. ముఖ్యంగా క్వాంటమ్ కంప్యూటింగ్, ఏఐ/ఎంఎల్, డేటా సైన్స్, సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్, చిప్ డిజైన్, వీఎల్ఎస్ఐ, సెమీకండక్టర్ అసెంబ్లీ ఃటెస్టింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్ వంటి అత్యంత కీలకమైన సబ్జెక్టులలో కోర్సులు అందుబాటులో ఉంటాయి.ఈ ప్రాజెక్టును వేగంగా పట్టాలెక్కిం చేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. 2026 సెప్టెంబర్ నుంచే మొదటి విద్యా కార్యక్రమాలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అమరావతిలో శాశ్వత క్యాంపస్ నిర్మాణం పూర్తయ్యేంత వరకు, గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన తాత్కాలిక కేంద్రం నుంచి తరగతులు, నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తారు. తొలి ఐదేళ్లలో సుమారు 8,250 మందికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వీరిలో 1,650 మంది డిగ్రీ కోర్సుల ద్వారా, 6,600 మంది స్కిల్లింగ్/సర్టిఫికేషన్ ద్వారా లబ్ధి పొందనున్నారు. ఐదో సంవత్సరం నాటికి ఏటా సుమారు 3,913 మంది విద్యార్థులను చేర్చుకునే స్థాయికి ఈ సంస్థ చేరుకుంటుంది. క్యాంపస్‌లో 500 పడకల నివాస సదుపాయం, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, సోలార్ పవర్, ఈవీ ఛార్జింగ్ వంటి పర్యావరణ హిత సౌకర్యాలు కూడా ఉంటాయి.ఈ ప్రాజెక్టుతో అమరావతి చుట్టూ ఒక టెక్ ఎకోసిస్టమ్‌ను నిర్మించి, దానిని 'క్వాంటమ్ వ్యాలీ'గా మార్చాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆకాంక్షలకు ఇది మరింత బలాన్ని చేకూరుస్తుంది. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య 2026 ఫిబ్రవరిలోనే ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. ఐఐటీ తిరుపతి, ట్రిపుల్ ఐటీ శ్రీసిటీ, ఆంధ్ర విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ వంటి ప్రముఖ విద్యాసంస్థలతో కలిసి పనిచేసేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రణాళికలు రచిస్తోంది.అయితే, ఇలాంటి పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేయడం ముఖ్యం అయినప్పటికీ, పరిశోధనలను ఆచరణాత్మక, వాణిజ్య నైపుణ్యాలుగా మార్చడమే అసలైన సవాల్ అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దేశీయంగా మేధో సంపత్తిని, సార్వభౌమ సాంకేతికతను సృష్టించాలంటే ఈ యూనివర్సిటీని పరిశ్రమలు, ఫ్యాబ్స్, డిజైన్ హౌస్‌లు, స్టార్టప్‌లతో బలంగా అనుసంధానించడం కీలకమని వారు సూచిస్తున్నారు. ఏదేమైనా, ఈ యూనివర్సిటీ ఏర్పాటు భారతదేశ సాంకేతిక ప్రస్థానంలో, ముఖ్యంగా అమరావతి అభివృద్ధిలో ఒక సువర్ణాధ్యాయమని చెప్పవచ్చు.

# ఒంగోలులో మహనీయుల స్ఫూర్తి



జరిగింది. నగరంలోని కిమ్స్ హాస్పిటల్ ఫ్లై ఓవర్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన 20 మంది ప్రముఖుల విగ్రహాలను రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇదే వేదికపై ప్రకాశం జిల్లా సంస్కృతి, పశుసంపదకు ప్రతీకగా నిలిచే ఒంగోలు గిత్త విగ్రహాన్ని కూడా ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, మహనీయుల జీవితాలు, వారి సేవలు, స్ఫూర్తిదాయకమైన ఆలోచనలు నేటి యువతకు, భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, విద్యా, సాహిత్య రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖుల విగ్రహాలను ఒకేచోట ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు నిత్యం కనిపించేలా ప్రధాన కూడలిలో ఈ విగ్రహాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆయా మహనీయుల సేవలు, త్యాగాలు, ఆశయాలు ప్రజలకు మరింత చేరువవుతాయని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఈ స్ఫూర్తిదాయక విగ్రహాలు ఒంగోలు నగరానికి మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని ఆయన తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన ఒంగోలు జాతి పశువుల విశిష్టతను చాటిచెప్పేలా, జిల్లా సంస్కృతికి అద్దం పట్టేలా ఒంగోలు గిత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై మంత్రి లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రకాశం జిల్లా పశుసంపదకు, వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, దీని ప్రాముఖ్యతను భావితరాలకు పరిచయం చేస్తుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, ఆనం రాంనారాయణ రెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్ రావు, ఉగ్ర నరిసింహారెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాజకీయ, స్వాతంత్ర్య సమరయోధులు: రొండా నారపరెడ్డి (మాజీ మంత్రి, ఎంపీ), దర్శి చెంచయ్య (స్వాతంత్ర్య సమరయోధుడు), మాదాల నారాయణ స్వామి (మాజీ ఎంపీ, ఎమ్మెల్యే)సామాజిక సేవకులు, విద్యావేత్తలు, అధికారులు: కత్తి చంద్రయ్య (ప్రకాశం జిల్లా తొలి కలెక్టర్), వరదా శ్రీరాముల నాయుడు (ఒంగోలు తొలి పురపాలక సంఘ అధ్యక్షులు), బివియల్ నారాయణ ('పావలా డాక్టర్'), క్లౌ జాన్ ఎవరెట్ (సామాజిక సేవకులు), గోరంట్ల వెంకన్న (మహాదాత), శ్రీ భద్రిరాజు కృష్ణమూర్తి (ద్రావిడ భాషాశాస్త్ర పితామహులు), బండారు రామారావు (నాటక సమాజ నిర్వాహకులు).కళా, సాహిత్య రంగ ప్రముఖులు: భానుమతి రామకృష్ణ (బహుముఖ ప్రజ్ఞాశాలి, నటి), గరికపాటి వరలక్ష్మి (నటి, గాయని), టి. కృష్ణ (విప్లవ దర్శకులు), షేక్ చినమౌలానా (నాదస్వర విద్వాంసులు), నీలంరాజు వెంకట శేషయ్య (పాత్రికేయులు, సాహితీవేత్త), ధారా రామనాథ శాస్త్రి (నాట్యావధాని), నాగభైరవ కోటేశ్వరరావు (కవి, రచయిత), కలేకూరి ప్రసాద్ (దళిత కవి, రచయిత), పైడి తెరేష్ బాబు (దళిత సాహితీవేత్త, కళాకారులు), మల్లవరపు జాన్ (కవి, రచయిత).

## వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద డ్రామా నడిపింది



**మొదటిపేజీ తరువాయి -** కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మెడికల్ బోర్డు ప్రక్రియను ఒక పెద్ద మొక్కుబడి డ్రామాగా మార్చేసి, అనారోగ్యంతో ఉన్న కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు.వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద ఎత్తున డ్రామా నడిపిందని కవిత ఆరోపించారు. దాదాపు 120 మంది కార్మికులను మెడికల్ బోర్డు ముందుకు రప్పించి, అందులో కేవలం 12 మందిని మాత్రమే 'అన్‌ఫిట్' అని తేల్చడం కాంగ్రెస్ ప్రభుత్వ దారుణమైన వైఖరికి, అన్యాయానికి స్పష్టమైన నిదర్శనమని మండిపడ్డారు. అనారోగ్యంతో సతమతమవుతున్న కార్మిక కుటుంబాలకు ఊరటనిచ్చే ఉద్దేశం గానీ, వారికి భరోసానిచ్చే చిత్తశుద్ధి గానీ ఈ ప్రభుత్వానికి ఎంతమాత్రం లేదని అన్నారు.మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ అర్హులైన కార్మికుడిని తక్షణమే అన్‌ఫిట్‌గా గుర్తించాలని, వారి వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని స్పష్టం చేశారు. కంటితుడుపు చర్యలతో కార్మికుల చట్టబద్ధమైన హక్కులను కాలరాస్తే రాబోయే రోజుల్లో సింగరేణి బొగ్గు గని క్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. బాధితులైన ప్రతి సింగరేణి కుటుంబానికి న్యాయం జరిగే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు..

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ ఎటువంటి వివక్ష లేకుండా ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో తొలి విడతలో భాగంగా 7,350 ఇళ్లను లాటరీ పద్ధతి ద్వారా అత్యంత పారదర్శకంగా లబ్ధిదారులకు అందజేస్తున్నామని ఆయన తెలిపారు.శుక్రవారం నాంపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కులం, మతం, రాజకీయాలకు అతీతంగా కేవలం అర్హతనే ప్రామాణికంగా తీసుకుని ఇళ్ల పంపిణీ చేపడుతున్నామని వెల్లడించారు. ఇప్పటికే కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్, రాజేంద్రనగర్, నాంపల్లి నియోజకవర్గాల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయిందని వివరించారు. పేదల ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా వందల కోట్ల రూపాయల విలువైన భూముల్లో సైతం గృహాలను నిర్మించి అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.రాబోయే పది రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల జాబితాను కూడా ప్రకటించే అవకాశం ఉందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాలను సేకరించి, టెండర్ల ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. మరో రెండు, మూడు రోజుల్లో ఆయా ప్రాంతాల్లో టవర్ల నిర్మాణం ప్రారంభమవుతుందని ఆయన వెల్లడించారు.

# తమిళనాడు అసెంబ్లీలో అరుదైన దృశ్యం



**మొదటిపేజీ తరువాయి -** తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ రాష్ట్ర అసెంబ్లీలో ఓ కొత్త సంప్రదాయానికి తెరలేపారు. శాసనసభలో దశాబ్దాలుగా కొనసాగుతున్న పద్ధతికి భిన్నంగా, తన కోసం కేటాయించిన ప్రత్యేక కుర్చీని వీడి, మంత్రుల కోసం ఉన్న వరుసలో వారి పక్కనే కూర్చుని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ ఘటన సభలో ఆసక్తికర చర్చకు దారితీసింది.సాధారణంగా అసెంబ్లీలో ముఖ్యమంత్రికి స్పీకర్ కుర్చీకి దగ్గరగా, ప్రత్యేకమైన, విశాలమైన కుర్చీని కేటాయిస్తారు. మంత్రులు వారి సీనియారిటీ ప్రకారం సీఎం పక్కన మొదటి వరుసలో కూర్చుంటారు. వారికి ఎదురుగా ప్రతిపక్ష నేత, ఇతర శాసనసభాపక్ష నేతలు ఆసీనులవుతారు. ఇది ఎప్పటినుంచో వస్తున్న సంప్రదాయం. అయితే, నిన్న మధ్యాహ్నం జరిగిన సమావేశంలో సీఎం విజయ్ అనూహ్యంగా తన కుర్చీ నుంచి లేచి, సభా నాయకుడైన మంత్రి కేఏ సెంగొట్టయాన్, మరో మంత్రి ఆదవ్ అర్జున మధ్యలో కూర్చున్నారు. సాధారణంగా మంత్రులు, ఎమ్మెల్యేలు కొద్దిసేపు తమ సహచరులతో మాట్లాడేందుకు స్థానాలు మారడం సహజమే. కానీ, ఒక ముఖ్యమంత్రి తన అధికారిక కుర్చీని వీడి మంత్రుల సీట్లో కూర్చోవడం ఇదే మొదటిసారని, గతంలో ఏ ముఖ్యమంత్రీ ఇలా చేయలేదని సభా వర్గాలు చెబుతున్నాయి.ఇదిలా ఉంటే.. అంతకుముందు సభలో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమైన అంశాలపై చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల కార్యదర్శులు సభలో తప్పనిసరిగా ఉండేలా చూడాలని ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ స్పీకర్‌ను కోరారు. "గత డీఎంకే ప్రభుత్వ హయాంలో కరూర్ ఘటనపై చర్చ జరిగినప్పుడు అప్పటి సీఎం (ఎంకే స్టాలిన్), ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర అధికారులు సభలోనే ఉన్నారు. కానీ ఇప్పుడు సీఎం, కార్యదర్శులు ఎవరూ సభలో లేరు" అని ఆయన ప్రస్తావించారు.దీనిపై మంత్రి ఆదవ్ అర్జున స్పందిస్తూ, కార్యదర్శులు పక్కనే ఉన్న 'వార్ రూమ్' నుంచి సభ్యుల ప్రసంగాలను నోట్ చేసుకుంటున్నారని తెలిపారు. అయితే, ఉదయనిధి వాదనతో స్పీకర్ జేసీడీ ప్రభాకర్ ఏకీభవించారు. ఇకపై కీలక చర్చల సమయంలో సీనియర్ అధికారులు సభలో ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, సీఎం విజయ్ ఉదయం కొన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొని, ఆ తర్వాతే అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారని తెలిసింది.

# నేరస్తులకు సింహస్వప్నం..

నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ విక్రమ్ సింహా మార్క్

క్రైమ్ కంట్రోల్‌లో దూకుడు.. దొంగతనాల కేసుల్లో

వేగవంతమైన దర్యాప్తు

రౌడీషీటర్లపై నిఘా.. చోరీ సొత్తు రికవరీలో ప్రత్యేక శ్రద్ధ

ఉత్తమ సేవకు పోలీస్ శాఖ ప్రశంసలు.. సీఐ విక్రమ్

సింహాకు ఉత్తమ సేవా పతకం













**కర్నూలు క్రైమ్, ఆగస్టు 28 (సీమకిరణం న్యూస్):** నేరస్తులకు చెక్ పెట్టడంలో.. బాధితులకు అండగా నిలవడంలో.. కేసుల ఛేదనలో వేగం చూపించడంలో కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. సీఐ విక్రమ్ సింహా ఆధ్వర్యంలో పోలీసులు నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపడుతూ ప్రజల్లో భద్రతా భావాన్ని పెంచుతున్నారు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలు, చైన్ స్నాచింగ్, బ్యాగ్ లిఫ్టింగ్ తదితర కేసులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. నేరం జరిగిన వెంటనే స్పందించి సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలు, నిందితుల కదలికలను పరిశీలిస్తూ దర్యాప్తును వేగవంతం చేస్తున్నారు.

### దొంగతనం జరిగిందంటే.. రికవరీపై ప్రత్యేక దృష్టి..

ఇటీవల నాలుగో పట్టణ పోలీసులు ఛేదించిన పలు కేసుల్లో భారీగా చోరీ సొత్తును రికవరీ చేశారు. ఒక కేసులో రూ.1.40 లక్షల నగదును స్వాధీనం చేసుకోగా, మరో కేసులో 15 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి ఆభరణాలను రికవరీ చేశారు. మరికొన్ని కేసుల్లో కూడా బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశారు. కేసు నమోదు చేయడంతో తమ బాధ్యత పూర్తయిందని భావించకుండా.. నిందితులను గుర్తించడం, అరెస్ట్ చేయడం, చోరీ సొత్తును రికవరీ చేయడం వరకు పోలీసులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

### రౌడీషీటర్లపై నిరంతర నిఘా!

నేరాల నియంత్రణలో భాగంగా రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులు, నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులపై ప్రత్యేక పర్యవేక్షణతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తున్నారు. పోలీసుల నిఘాతో నేరస్తుల్లో భయం.. సాధారణ ప్రజల్లో భరోసా కనిపిస్తోంది.

### ఉత్తమ సేవకు గుర్తింపు..

నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ విక్రమ్ సింహా సేవలకు పోలీస్ శాఖ నుంచి కూడా గుర్తింపు లభించింది. విధి నిర్వహణలో ప్రతిభ, నిబద్ధత, క్రమశిక్షణతో విశిష్ట సేవలు అందించినందుకు "ఉత్తమ సేవా పతకం" అందుకున్నారు. ఈ గుర్తింపు ఆయన వ్యక్తిగత ప్రతిభకు మాత్రమే కాకుండా, ఆయన ఆధ్వర్యంలో పనిచేస్తున్న సిబ్బంది సమష్టి కృషికి కూడా గుర్తింపుగా భావించవచ్చు.

### బాధితులకు అండగా.. ప్రతి ఒక్కరికీ న్యాయం..

పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను శ్రద్ధగా విని, చట్టపరమైన పరిష్కారం చూపేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ న్యాయం అందించాలనే లక్ష్యంతో పోలీసులు పనిచేస్తున్నారనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

### సీఐ విక్రమ్ సింహా పనితీరుపై ప్రశంసలు..

కేసుల దర్యాప్తులో వేగం, నేరస్తులపై నిఘా, చోరీ సొత్తు రికవరీ, బాధితులకు న్యాయం, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ విధుల నిర్వహణ వంటి అంశాల్లో నాలుగో పట్టణ పోలీసులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.

### నేరస్తులకు నాలుగో పట్టణం సింహస్వప్నం..

### బాధితులకు మాత్రం భరోసా!

ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, నేరాలను నియంత్రించేందుకు మరింత కఠినంగా వ్యవహరిస్తున్న నాలుగో పట్టణ పోలీసుల పనితీరుపై ప్రజల్లో సానుకూల స్పందన వ్యక్తమవుతోంది. "ప్రజల భద్రతే ప్రథమ కర్తవ్యం.. నేరస్తులపై చట్ట ప్రకారం చర్యలు.. బాధితులకు న్యాయం" అనే లక్ష్యంతో నాలుగో పట్టణ సీఐ విక్రమ్ సింహా ముందుకు సాగుతున్నారు.

## ఆటో డ్రైవర్లకు అవగాహన కనిపించిన న్యాయమూర్తి



**డోన్ టౌన్, ఆగస్టు 29,(సీమ కిరణం న్యూస్):** డోన్ లో శుక్రవారం రోజు ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు మరియు బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌పై అవగాహన కల్పించేందుకు కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 2వ తరగతి మేజిస్ట్రేట్ ఎస్ .నూరుల్లా మరియు డోన్ డీఎస్పీ శ్రీనివాస్ హాజరై ఆటో డ్రైవర్లకు పలు ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు.

**ఈ సందర్భంగా అధికారులు ముఖ్యంగా:**

మద్యం సేవించి వాహనం నడపడం ( డ్రంక్ అండ్ డ్రైవ్) వల్ల కలిగే ప్రమాదాలు, ప్రాణనష్టం మరియు చట్టపరమైన పరిణామాలను వివరించారు. మద్యం సేవించి వాహనం నడిపితే రూ.10,000 వరకు జరిమానాతో పాటు జైలు శిక్ష వంటి కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించి, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. ఆటో డ్రైవర్లకు యూనిఫాంలో భాగమైన 50ఖాకీ షర్టులను నరేంద్ర మరియు కమల్ స్పాన్సర్ చేశారు. ఈ సందర్భంగా వారిని అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో డోన్ టౌన్ సి ఐ ఇంతియాజ్ భాష, ఆటో యూనియన్ నాయకులు అనీర్, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## క్షతగాత్రులను పరామర్శించిన మాజీ మంత్రి బుగ్గన



**డోన్ టౌన్, ఆగస్టు 29,(సీమ కిరణం న్యూస్):** డోన్ మండల జగదుర్తి గ్రామంలో గత రెండు రోజుల క్రితం టిడిపి నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడి, కర్నూల్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న జగదుర్తి వైయస్సార్సీపి నాయకులు మోహనరెడ్డి, రఘునాథ్ రెడ్డిలను శుక్రవారం మాజీ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించి నేనున్నానంటు భరోసా నిచ్చారు. వారిని పరామర్శించిన వారిలో ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి , మండల వైయస్సార్సీపి అధ్యక్షులు సోమేశ్ యాదవ్ , జడ్పీటిసి బద్దల రాజకుమార్ , తిరుమల్ రెడ్డి , గజేంద్ర రెడ్డి , నియోజకవర్గ బూత్ కన్వీనర్ దొరపల్లి చిరంజీవి, జగదుర్తి గ్రామ వైయస్సార్సీపి నాయకులు మోహన్ రెడ్డి , శివానందరెడ్డి , అల్లా బకాష్ , సురేష్ , మసాలా రంగడు తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరులో సాయి శ్వాస స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం




**నెల్లూరు,ఆగస్టు 28, (సీమకిరణం న్యూస్)::** నెల్లూరు నగరంలోని జేమ్స్ గార్డెన్ ప్రాంతంలో నూతన సాయి శ్వాస స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభానికి ముఖ్యఅతిథిగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పాల్గొని.. సాయి శ్వాస స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత సీనియర్ పర్మనాలజిస్ట్ డాక్టర్ నూకల సునీల్ కుమార్,పలువురు ప్రముఖ డాక్టర్లు, బంధుమిత్రులతో కలిసి అట్టహాసంగా సాయి శ్వాస స్పెషాలిటీ హాస్పిటల్ ని ప్రారంభించారు.నూతన హాస్పిటల్ ప్రారంభానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి శాలువాలతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సాయి శ్వాస స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత సీనియర్ పర్మనాలజిస్ట్ డాక్టర్ నూకల సునీల్ కుమార్ మాట్లాడుతూ నెల్లూరు నగరంలోని జేమ్స్ గార్డెన్ ప్రాంతంలో నూతన సాయి శ్వాస స్పెషాలిటీ హాస్పిటల్ ని ప్రారంభించడం జరిగిందన్నారు.ఈ హాస్పిటల్ ప్రారంభానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఆత్యాధుని క సదుపాయాలతో విస్తృతమైన సేవలు అందించడానికి నూతన సాయి శ్వాస స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించామన్నారు. ఈ హాస్పిటల్లో దీర్ఘకాలిక దగ్గు,నేమ్ము,అస్తమా,(ఆయాసం),క్షయ వ్యాధి,(టీబి),ఛాతి నొప్పి,పలు రకాల జ్వరాలు,గురక, నిద్రకు సంబంధించిన వ్యాధులు,దగ్గులో రక్తం పడుట,సిగరెట్ తాగటం వల్ల వచ్చే అనేక రకముల వ్యాధులు,అలాగే పలు రకాల వ్యాధులకు ఈ నూతన స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్నామని,ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సాయి శ్వాస స్పెషాలిటీ హాస్పిటల్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నారాయణకు రాఖీ కట్టిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు,ఆగస్టు 28,(సీమకిరణం న్యూస్)::** రక్షాబంధన్ పండగ వేళ విజయవాడలో రాష్ట్ర స్థాయి ప్రముఖుల మధ్య ఆత్మీయ దృశ్యం ఆవిష్కృతమైంది.నెల్లూరు జిల్లా కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సాంప్రదాయబద్ధంగా మంగళహారతి పట్టి, సోదర భావంతో రాఖీ కట్టి రక్షాబంధన్ మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ,ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. తనకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపిన కోవూరు ఎమ్మెల్యేకు మంత్రి నారాయణ మిఠాయిలు తినిపించి వేద ఆశీస్సులు అందించడమే కాకుండా,ప్రజాక్షేత్రంలోనూ, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిలోనూ ఆమె మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## యర్రగుంట్ల పాఠశాలకు రూ.25 వేల విలువైన మైక్‌సెట్ విరాళం



**డోన్ టౌన్, ఆగస్టు 29,(సీమ కిరణం న్యూస్):** డోన్ మండలంలోని యర్రగుంట్ల గ్రామ ప్రభుత్వ పాఠశాలకు సందు బలరాం కుమారుడు సందు మహేంద్ర కుమార్ రూ.25 వేల విలువైన మైక్‌సెట్‌ను విరాళంగా అందజేశారు. పాఠశాల అవసరాలను గుర్తించి మైక్‌సెట్ అందించడం పట్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో మహేంద్ర కుమార్ కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమొంటోలు అందజేసి అభినందించారు. విద్యార్థులు మరింత పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు బైరెడ్డి గంగిరెడ్డి, సెక్రటరీ మల్లారెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, రోటరీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల ప్రోత్సాహానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపితే

భారీ జరిమానాలు.. జైలు శిక్ష తప్పదు

ఎస్సై అనిల్ కుమార్




**ప్యాపిలి ఆగస్టు 28 (సీమ కిరణం న్యూస్):** మద్యం సేవించి వాహనం నడిపితే భారీ జరిమానాలతో పాటు జైలు శిక్ష కూడా తప్పదని జలదుర్గం ఎస్సై అనిల్ కుమార్ హెచ్చరించారు. జలదుర్గం పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నిందితుడు శివశంకర్‌కు స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నురుల్లా రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపడం తీవ్రమైన నేరమని పేర్కొన్నారు. మద్యం మత్తులో వాహనం నడపడం వల్ల వాహనదారుడి ప్రాణాలతో పాటు అమాయక ప్రజల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు గుర్తించిన వారిపై తక్షణమే కేసులు నమోదు చేసి, కోర్టు ముందు హాజరుపరుస్తామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలు, చట్టాలను కచ్చితంగా పాటించాలని ఎస్సై అనిల్ కుమార్ సూచించారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే శిక్ష తప్పదు

ఎస్సై నాగార్జున



**ప్యాపిలి, ఆగస్టు 28 (సీమ కిరణం న్యూస్) :** మద్యం సేవించి వాహనాలు నడిపితే శిక్ష తప్పదు అని ఎస్సై నాగార్జున హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడిపిన ప్యాపిలి మండలం రామరత్నగిరి గ్రామానికి చెందిన రాచిపోగుల దేవేంద్ర (32)కు డోన్ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ప్యాపిలి ఎస్సై నాగార్జున తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన ఐదు కేసుల్లో నిందితులకు కోర్టు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ప్యాపిలి పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన డ్రంకెన్ డ్రైవ్ కేసులపై విచారణ అనంతరం కోర్టు తీర్పు వెలువడిందని ఎస్సై తెలిపారు. ఒక డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రెండు రోజుల జైలు శిక్ష, ఐదు ఓపెన్ డ్రింకింగ్ కేసుల్లో జరిమానా విధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్సై నాగార్జున మాట్లాడుతూ.. వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ ధరించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాహనదారులు అప్రమత్తంగా ఉండి రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. ఆగస్టు నెలలో ఇప్పటివరకు 15 సెక్షన్ 125 బీఎన్ఎస్ కేసులు నమోదు చేసి, వాటికి సంబంధించి రూ.37,500 జరిమానా వసూలు చేసినట్లు ఎస్సై నాగార్జున తెలిపారు. అదేవిధంగా 250 ఈ-చలాన్ కేసులు నమోదు చేసి రూ.46,250 జరిమానా విధించినట్లు వెల్లడించారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం కావద్దని, ప్రతి వాహనదారుడు బాధ్యతగా వ్యవహరిస్తూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని ఎస్సై నాగార్జున కోరారు.

## ఎమ్మెల్యే కోట్ల సమక్షంలో టీడీపీలోకి భారీ చేరికలు







**ప్యాపిలి, ఆగస్టు 28 (సీమ కిరణం న్యూస్):** డోన్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి ప్రజా మద్దతు మరింత పెరుగుతోందని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ప్యాపిలి మండల పరిధిలోని కలచట్ల, పెద్దపూజర్ల గ్రామాలకు చెందిన సుమారు 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరాయి. డోన్‌లోని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి వారిని టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తున్న తీరును చూసి ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని తెలిపారు. డోన్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని, పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు, కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, టీడీపీ సీనియర్ మండల నాయకులు గడ్డం అంకిరెడ్డి, కమతం భాస్కర్‌రెడ్డి, కలచట్ల బత్తుల రమేష్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర యువ నాయకులు చల్లా అనుదీప్‌కుమార్, కలచట్ల ప్రసాద్, సయ్యద్ అక్బర్‌వలి, పగడాల రాజేష్, పచ్చ చంద్రశేఖర్ యాదవ్, కుళ్లాయి స్వామి తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో సరస్వతి (ఎంపీటీసీ), జయరామయ్య, లక్ష్మయ్య, పెద్ద నాగన్న, నాగభూషణం, ఓబులేసు, రాజు, రాముడు, ఇనుమ రంగన్న, నాగేంద్ర, వడ్డే ఓబులేసు, మల్లప్ప, సుధాకర్, మిద్దె చిన్న ఆంజనేయ, మద్దికేర సుధాకర్, లక్ష్మిన్న, రామాంజనేయులు, నారాయణస్వామి తదితరులు ఉన్నారు. పెద్దపూజర్ల నుంచి మన్నెం నారాయణస్వామి, సుధాకర్, మిద్దగిరి కుమార్ తదితరులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కొత్తగా పార్టీలో చేరిన కుటుంబాల సభ్యులు మాట్లాడుతూ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి నాయకత్వంపై, తెలుగుదేశం పార్టీ విధానాలపై నమ్మకంతోనే టీడీపీలో చేరినట్లు తెలిపారు.

## విద్యార్థులకు సంకల్ప్-2026 స్టడీ మెటీరియల్ పంపిణీ



**ప్యాపిలి ఆగస్టు 28 (సీమ కిరణం న్యూస్):** ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్యాపిలిలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు సంకల్ప్-2026 ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచే లక్ష్యంతో ఇంటర్మీడియట్ బోర్డు ప్రవేశపెట్టిన ఈ ప్రత్యేక స్టడీ మెటీరియల్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్, హిస్టరీ తదితర అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ముఖ్యమైన ప్రశ్నలు, సులభతరమైన సమాధానాలను పొందుపరిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం మాట్లాడుతూ. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేసిందన్నారు. విద్యార్థులు పరీక్షల్లో సులభంగా ఉత్తీర్ణత సాధించేలా ముఖ్యమైన ప్రశ్నలను ఎంపిక చేసి, సులభమైన సమాధానాలతో సంకల్ప్-2026 స్టడీ మెటీరియల్‌ను రూపొందించినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని క్రమం తప్పకుండా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నవీనపాటి, ఓబులేసు, వెంకటరమణ, మద్దిలేటి, ముస్తాక్, శంకరయ్య, మురళీమోహన్ గౌడ్, సురేష్, వన్నూర్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు

## నాటు సారాపై ఎక్సైజ్ ఉక్కుపాదం

200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ఎక్సైజ్ సీఐ జాఫ్రుల్లా





**ప్యాపిలి ఆగస్టు 28 (సీమ కిరణం న్యూస్):** నాటు సారా తయారీని అరికట్టేందుకు ఎక్సైజ్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో భాగంగా ప్యాపిలి మండలం సీతమ్మ తండా కొండ ప్రాంతంలో 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ జాఫ్రుల్లా తెలిపారు. కర్నూలు జిల్లా డిప్యూటీ కమిషనర్ పి. శ్రీదేవి, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎస్. రవికుమార్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎస్సై పి. దౌలత్ ఖాన్ వారి సిబ్బంది సుధాకర్ రెడ్డి, శేషన్న, గోపాల్ సింగ్, ఇందుమతితో కలిసి సీతమ్మ తండా కొండ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 200 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ. ఎవరైనా నాటు సారా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా వెంటనే డోన్ ఎక్సైజ్ సీఐకు 9440902584 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం రాచర్ల సిమెంట్ ఫ్యాక్టరీకి వస్తున్న ఇతర రాష్ట్రాల లారీలను ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేశారు. తనిఖీల్లో ఎలాంటి మద్యం పట్టుబడలేదని అధికారులు తెలిపారు.

## రూ.5 లక్షల వరకూ హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై జీఎస్టీ రద్దు జీఎస్టీ జీఓఎం సిఫారసు



టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలు, సీనియర్ సిటిజన్లకు హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ ప్రీమియంలపై జీఎస్టీ పూర్తిగా రద్దు చేయాలని బీహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి అధ్యక్షతన జరిగిన జీఎస్టీ మంత్రుల బృందం (జీఓఎం) సమావేశం ప్రతిపాదించింది. ప్రస్తుతం రూ.5 లక్షల వరకూ ఆరోగ్య బీమా పథకాలపై అందరికీ జీఎస్టీ రద్దు చేయాలని పేర్కొంది. అయితే రూ5. లక్షలు దాటిన ఆరోగ్య బీమా పాలసీలపై 18 శాతం జీఎస్టీ కొనసాగుతుంది. వచ్చేనెలలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో హెల్త్ బీమా పాలసీలు, టర్మ్ జీవిత బీమా పాలసీల ప్రీమియం చెల్లింపులపై జీఎస్టీ తగ్గింపు, మినహాయింపు విషయమై తుది నిర్ణయం తీసుకోనున్నది. ఇక కొన్ని వస్తువులపై జీఎస్టీ వసూళ్లను క్రమబద్ధీకరించాలని ప్రతిపాదించింది. తాగునీరు, సైకిళ్లు, ఎక్సర్‌సైజ్ నోట్ బుక్‌లు, లగ్జరీ రిస్ట్ వాచీలు, బూట్లపై తగ్గించాలని సూచించింది. 20 లీటర్ల ప్యాకేజ్డ్ డ్రింక్ వాటర్ మీద జీఎస్టీ 18 నుంచి ఐదు శాతానికి తగ్గించాలని జీఓఎం కోరింది. జీఎస్టీ జీఓఎం సిఫారసులను జీఎస్టీ కౌన్సిల్ ఆమోదిస్తే సైకిళ్లపై 12 నుంచి ఐదు శాతానికి జీఎస్టీ తగ్గి రూ.10 వేల లోపు ధరకు దిగి వస్తాయి. ఎక్సర్‌సైజ్ నోట్ బుక్‌లపై జీఎస్టీ 12 నుంచి ఐదు శాతానికి తగ్గించాలని జీఓఎం ప్రతిపాదించింది. ఇక రూ.25 వేల పై చిలుకు ధర గల లగ్జరీ రిస్ట్ వాచీలపై జీఎస్టీ 18 నుంచి 28 శాతానికి పెంచాలని సూచించింది. రూ.15 వేల పై చిలుకు విలాసవంతమైన బూట్లపై జీఎస్టీని 18 నుంచి 28 శాతానికి పెంచాలని పేర్కొంది.

## మధ్యతరగతి ఇండ్ల కొనుగోలు దారులకు ఐదు శాతంపై రూ.25 లక్షల రుణ పరపతి కల్పించాలి.. నారెడ్కో



ప్రతి ఒక్కరికి సొంతింటి కల ఉంటుంది. దాని సాకారం కోసం సుదీర్ఘ కాలం ప్రణాళికతో ముందుకు సాగుతుంటారు. ప్రస్తుతం ఇండ్ల ధరలు ఆకాశాన్నంటే రీతిలో పెరిగిపోతున్న నేపథ్యంలో మధ్యతరగతి వర్గ ప్రజలకు వెసులుబాటు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్ మెంట్ కౌన్సిల్ (నారెడ్కో) అధ్యక్షుడు జీ హరిబాబు కోరారు. ఐదు శాతం వడ్డీరేటుపై రూ.25 లక్షల వరకూ మధ్యతరగతి వర్గ ప్రజలకు ఇండ్ల కొనుగోలుకు రుణం ఇవ్వాలని కోరారు. మొత్తం దేశ జనాభాలో 30 శాతం మంది మధ్యతరగతి వర్గ ప్రజలు. వారంతా అద్దె ఇండ్లలోనే నివసిస్తుంటారు. ప్రస్తుతం ఇండ్ల రుణాలపై బ్యాంకులు 8.75 నుంచి 9 శాతం వడ్డీ వసూలు చేస్తున్నాయి. దీనివల్ల ఈఎంఐలు భారీగా ఉంటున్నాయి. ఈ పరిస్థితి నుంచి మధ్య తరగతి వర్గ ప్రజలను రక్షించడానికి రూ.25 లక్షల రుణ పరపతి కల్పించాలని హరిబాబు కేంద్రాన్ని కోరారు. '30 శాతం మంది మధ్యతరగతి వర్గ ప్రజల్లో మెజారిటీ రూ.50 వేల నుంచి రూ.70 వేల మధ్య వేతనం అందుకుంటున్నారు. వీరు ఈఎంఐల రూపంలో నెలకు రూ.15,000-20,000 చెల్లించగలరు. రూ.20 వేల ఈఎంఐ ప్రాతిపదికన ఇంటి కొనుగోలుకు రూ.20 లక్షల రుణం మాత్రమే లభిస్తుంది. ఢిల్లీ, ముంబై వంటి ప్రధాన నగరాల్లో ఇండ్ల నిర్మాణ ప్రాజెక్టులు చేపడుతున్న రియాల్టీ సంస్థలు రూ.20 లక్షల్లోపు ధరకు మధ్య తరగతి వర్గ ప్రజలకు ఇండ్లు సమకూర్చ గలవా?. రూ. లక్ష లోపు వేతనం తీసుకుంటున్న వారికి ఈ అవకాశమే లేదు' అని హరిబాబు పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, ఇండ్ల అద్దెలు భారీగా పెరిగిపోయాయి. 2019 నుంచి దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో ఇండ్ల ధరలు 45 శాతం పెరిగితే, ఇండ్ల అద్దెలు 64 శాతం పెరిగాయి. 'ఐదు శాతం ఫిక్స్‌డ్ వడ్డీరేటుపై తొలి ఐదేండ్లలో రూ.20 లక్షల ఇంటి రుణం కల్పిస్తే ఈఎంఐ రూ.16 వేల నుంచి రూ.17 వేలకు దిగి వస్తుంది. వన్ బెడ్ రూమ్, ఒక హాలు, కిచెన్ గల ఇల్లు కొనుగోలు చేయడానికి వారు మరో రూ.10-15 లక్షలు రెగ్యులర్ వడ్డీరేటుపై రుణం పొందే అవకాశం ఉంటుంది' అని హరిబాబు తెలిపారు. లగ్జరీ, అల్ట్రా లగ్జరీ ఇండ్ల కోసం మొత్తం పది శాతం జనాభా నుంచి మాత్రమే డిమాండ్ ఉంది. మిగతా 60 శాతం మంది జనాభా ఆర్థికంగా బలహీన వర్గాల ప్రజలే. వారికి ఉచిత ఇండ్ల పథకాల ద్వారా సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చునని హరిబాబు అన్నారు.

## ఐటీఆర్ ఫైలింగ్‌లో కొత్త రికార్డు 7.28 కోట్లు దాటిన ఐటీఆర్స్




గత ఆర్థిక సంవత్సరం ( 2023-24) ఐటీ రిటర్న్స్‌లో సరికొత్త రికార్డు నమోదైంది. 2022-23 ఐటీ రిటర్న్స్‌తో పోలిస్తే 7.5 శాతం వృద్ధితో 7.28 కోట్ల పై చిలుకు ఐటీఆర్‌లు నమోదయ్యాయని ఆదాయం పన్ను విభాగం శుక్రవారం తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం ఐటీఆర్ దాఖలు చేయడానికి జూలై 31తో గడువు ముగిసింది. 2024-25 అంచనా సంవత్సర ఐటీ రిటర్న్స్ జూలై 31 నాటికి 7.28 కోట్లకు పైగా ఫైల్ అయ్యాయి. 2023-24 అంచనా సంవత్సర ఐటీ రిటర్న్స్ 6.77 కోట్ల ఫైలింగ్స్ తో పోలిస్తే 7.5 శాతం ఎక్కువ అని ఓ ప్రకటనలో తెలిపింది. '2024-25 అంచనా సంవత్సరంలో మొత్తం 7.28 కోట్ల ఐటీఆర్ ఫైలింగ్స్‌లో కొత్త ఆదాయం పన్ను విధానం కింద 5.27 కోట్ల ఐటీఆర్‌లు ఫైల్ కాగా, పాత ఆదాయం పన్ను విధానం కింద 2.01 కోట్ల ఐటీఆర్‌లు ఫైల్ అయ్యాయి' అని వివరించింది. దీంతో పన్ను చెల్లింపుదారుల్లో సుమారు 72 శాతం మంది కొత్త ఆదాయం పన్ను విధానాన్ని ఎంచుకుంటే, 28 శాతం మంది పాత ఆదాయం పన్ను విధానంలో ఐటీఆర్ ఫైల్ చేశారు. 2024-25 అంచనా సంవత్సరంలో అడిటింగ్ అవసరం లేని వేతన జీవులు ఐటీఆర్ ఫైల్ చేయడానికి 2024 జూలై 31 తుది గడువు. ఒక్క రోజే అత్యధికంగా 69.92 లక్షల ఐటీఆర్‌లు ఫైల్ అయ్యాయి. తొలిసారి ఐటీఆర్ ఫైల్ చేసిన వారు 58.57 లక్షల మంది ఉన్నారు. ఆదాయం పన్ను పరిధి విస్తృతం అవుతుందని చెప్పడానికి ఇది సంకేతం అని ఆదాయం పన్ను విభాగం వివరించింది. ఐటీఆర్ ఫైల్ చేయడం కోసం ఆదాయం పన్ను విభాగం ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీన.. అంటే ఆర్థిక సంవత్సరం తొలి రోజే 'ఈ-ఫైలింగ్ పోర్టల్'లో ఐటీఆర్ ఫామ్స్ (ఐటీఆర్-1, ఐటీఆర్-2, ఐటీఆర్-4, ఐటీఆర్-6) అందుబాటులోకి తెచ్చింది. ఇలా ఆర్థిక సంవత్సరం ప్రారంభం నాడే ఐటీఆర్ ఫామ్స్ అందుబాటులోకి తేవడం చారిత్రాత్మకంగా నిలిచింది. మొత్తం 7.28 కోట్ల ఐటీఆర్‌ల్లో ఐటీఆర్ -1 ఫామ్ కింద 45.77 శాతం అంటే 3.34 కోట్లు, ఐటీఆర్-2 ఫామ్ కింద 1.09 కోట్ల మంది (14.93 శాతం), ఐటీఆర్-3 ఫామ్ కింద 91.10 లక్షల మంది (12.5 శాతం0, ఐటీఆర్ -4 ఫామ్ కింద 1.88 కోట్ల మంది (25.77 శాతం), ఐటీఆర్ -5 నుంచి ఐటీఆర్ -7 ఫామ్స్ వరకూ 7.48 లక్షల మంది (1.03 శాతం) ఐటీఆర్ ఫైల్ చేశారు. 43.82 శాతం మంది 'ఈ-ఫైలింగ్ పోర్టల్'లో ఆన్ లైన్ ఐటీఆర్ యుటిలిటీ సేవలను వినియోగించుకుని ఐటీఆర్ ఫైల్ చేస్తే, మిగతా వారు ఆఫ్ లైన్ చానళ్ల ద్వారా దాఖలు చేశారు. మొత్తం 7.28 కోట్ల ఐటీఆర్‌ల్లో 6.21 కోట్ల పై చిలుకు ఐటీఆర్‌ల ఈ-వెరిఫికేషన్ పూర్తి చేసుకున్నారు. వాటిలో ఆధార్ ఆధారిత ఓటీపీ ద్వారా 5.81 కోట్ల పై చిలుకు (93.56 శాతం) మంది ఈ-వెరిఫికేషన్ పూర్తి చేసుకున్నారు. జూలై 31 వరకూ వేతన జీవులు, ఐటీ ఫైల్ చేస్తున్న వారి నుంచి వచ్చిన సుమారు 10.64 లక్షల సందేహాలను ఈ-ఫైలింగ్ హెల్ప్ డెస్క్ నివృత్తి చేసింది.

# ఒక్క గంటలో రూ.12,295 కోట్లు రాబట్టి రికార్డ్ సృష్టించిన గౌతమ్ అదానీ!



దీపావళి ముహూర్తపు స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ గౌతమ్ అదానీకి చాలా లాభదాయకంగా ఉంది. అదానీ గ్రూప్‌నకు చెందిన 10 కంపెనీల్లో 9 కంపెనీల షేర్లలో పెరుగుదల కనిపించింది. ఇందులో అదానీ గ్రీన్ ఎనర్జీ మార్కెట్ క్యాప్ అత్యధికంగా పెరిగింది. 9 కంపెనీల మార్కెట్ క్యాప్ గురించి చూస్తే.. మొత్తం రూ.12,295 కోట్ల పెరుగుదల కనిపించింది. అదే సమయంలో అదానీ విల్మార్ మార్కెట్ క్యాప్ నష్టాలను చవిచూసింది. గౌతమ్ అదానీ గ్రూప్‌కి చెందిన ఏ కంపెనీ ఎంత లాభపడిందో, ఎవరు ఎంత నష్టపోయారో తెలుసుకుందాం.

**1.** అదానీ ఎంటర్‌ప్రైజెస్ మార్కెట్ క్యాప్ రూ.201.99 కోట్లు లాభపడింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.3,40,096.66 కోట్ల నుంచి రూ.3,40,298.65 కోట్లకు పెరిగింది.

**2.** అదానీ పోర్ట్, సెజ్ మార్కెట్ క్యాప్ రూ.3,747.85 కోట్లు లాభపడింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.2,97,386.32 కోట్ల నుంచి రూ.3,01,134.17 కోట్లకు పెరిగింది.

**3.** అదానీ పవర్ మార్కెట్ క్యాప్ రూ.1,581.35 కోట్లు లాభపడగా, కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.2,28,658.62 కోట్ల నుంచి రూ.2,30,239.97 కోట్లకు పెరిగింది.

**4.** అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ మార్కెట్ క్యాప్ రూ.102.11 కోట్లు లాభపడింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.1,17,209.15 కోట్ల నుంచి రూ.1,17,311.26 కోట్లకు పెరిగింది.

**5.** అదానీ గ్రీన్ ఎనర్జీ మార్కెట్ క్యాప్ రూ.5,369.88 కోట్లు లాభపడింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.2,53,128.38 కోట్ల నుంచి రూ.2,58,498.26 కోట్లకు పెరిగింది.

**6.** అదానీ టోటల్ గ్యాస్ మార్కెట్ క్యాప్ రూ.505.92 కోట్లు లాభపడింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.79,032.35 కోట్ల నుంచి రూ.79,538.27 కోట్లకు పెరిగింది.

**7.** అదానీ గ్రూప్: ఒకే ఒక్క కంపెనీ అదానీ విల్మార్ మార్కెట్ క్యాప్‌లో క్షీణతను చవిచూసింది. ఈ కంపెనీ రూ.279.43 కోట్ల నష్టాన్ని చవిచూసింది. ఆ తర్వాత కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.44,981.88 కోట్ల నుంచి రూ.44,702.45 కోట్లకు తగ్గింది.

**8.** అదానీ గ్రూపునకు చెందిన సిమెంట్ కంపెనీ ఏసీసీ లిమిటెడ్ మార్కెట్ క్యాప్ రూ.156.81 కోట్లు లాభపడింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.43,562.88 కోట్ల నుంచి రూ.43,719.69 కోట్లకు పెరిగింది.

**9.** అదానీ గ్రూపునకు చెందిన సిమెంట్ కంపెనీ అంబుజా సిమెంట్స్ మార్కెట్ క్యాప్ రూ.615.79 కోట్లు లాభపడింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.1,42,959.68 కోట్ల నుంచి రూ.1,43,575.47 కోట్లకు పెరిగింది.

**10.** అదానీ గ్రూప్ మీడియా సంస్థ ఎన్డీటీవీ మార్కెట్ క్యాప్ రూ.12.9 కోట్లు లాభపడింది. ఆ తర్వాత కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.1,084.40 కోట్ల నుంచి రూ.1,097.30 కోట్లకు పెరిగింది.

**11.** అదానీ గ్రూప్‌కు చెందిన 10 కంపెనీల్లో 9 కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.12,294.6 కోట్లు పెరిగింది. ఒక కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.279 కోట్లకు పైగా నష్టాన్ని చవిచూసింది.

# ఇప్పుడు క్రెడిట్ కార్డ్ పొందడం అంత సులభం కాదు బ్యాంకులు కీలక నిర్ణయం




గత కొన్నేళ్ల నుంచి క్రెడిట్ కార్డుల వాడకం విపరీతంగా పెరిగిపోయింది. బ్యాంకులు కూడా అధిక మొత్తంలో క్రెడిట్ కార్డులను జారీ చేశాయి. కానీ ఇప్పుడు క్రెడిట్ కార్డుల వల్ల సమస్య ఏర్పడటంతో కార్డుల జారీ విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాయి. చాలా మంది క్రెడిట్ కార్డులు డిఫాల్ట్‌గా మారుతున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (%=దీ×%) నుండి ఇటీవలి డేటా ప్రకారం, సెప్టెంబర్‌లో కొత్త క్రెడిట్ కార్డ్‌లను జోడించే వేగం గణనీయంగా తగ్గింది. ఇది ఆగస్టులో 9.2 లక్షల కొత్త కార్డుల నుండి సెప్టెంబర్‌లో 6.2 లక్షలకు పడిపోయింది. గత సంవత్సరంతో పోలిస్తే ఇది 64% భారీ క్షీణతను సూచిస్తుంది. మొత్తం క్రెడిట్ కార్డ్‌ల సంఖ్య 106 మిలియన్లకు చేరుకుంది. చాలా మంది క్రెడిట్ కార్డులు డిఫాల్ట్‌గా మారుతుండటంతో ఇక నుంచి కార్డులు జారీ చేసే విషయంలో బ్యాంకులు జాగ్రత్త పడుతున్నాయి. ఆర్బీఐ ఆదేశాల ప్రకారం కార్డుల జారీ విషయంలో వెనకడుగు వేస్తున్నాయి. పెరుగుతున్న నష్టాల కారణంగా కొత్త కస్టమర్లను చేర్చుకోవడంలో బ్యాంకులు ఇప్పుడు మరింత జాగ్రత్తగా మారాయని విశ్లేషకులు భావిస్తున్నారు. కొత్త కార్డుల జారీలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఎస్‌బిఐ కార్డ్‌లు ముందున్నాయని, అయితే సమీప భవిష్యత్తులో క్రెడిట్ కార్డ్ పంపిణీ వేగం మందగించే అవకాశం ఉందని ఐడిబిఐ క్యాపిటల్ అనలిస్ట్ బంటీ చావ్లా చెప్పారు.

### నివేదిక ఏం చెబుతోంది?

ఆర్బీఐ ఇటీవల రిస్క్ ప్రమాణాలను మార్చింది. క్రెడిట్ కార్డులు డిఫాల్ట్‌గా మారుతుండటంతో వ్యక్తిగత రుణాలకు, ఇతర రుణాలపై ప్రభావం పడుతోంది. క్రెడిట్ కార్డ్, ఇతర రక్షణ లేని రుణ విభాగాలలో పెరుగుతున్న నష్టాలను నియంత్రించడం దీని లక్ష్యం. సెప్టెంబర్‌లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ 4.3 లక్షల కొత్త కార్డులను జారీ చేయగా, ఎస్‌బిఐ కార్డ్ 1.4 లక్షలు, యాక్సిస్ బ్యాంక్ 53,000 కార్డులను జారీ చేశాయి.

### ఎవరి కార్డులు డిఫాల్ట్‌గా మారుతున్నాయి?

నివేదిక ప్రకారం, బ్యాంకుల క్రెడిట్ కార్డ్ పోర్ట్‌ఫోలియోలో డిఫాల్ట్ రేట్లు ఇప్పుడు 6%కి దగ్గరగా ఉన్నాయి. ఇది బ్యాంకింగ్ రంగానికి ఆందోళన కలిగించే విషయం. మధ్య ఆదాయ సమూహంలో క్రెడిట్ కార్డ్ డిఫాల్ట్ రేటు ఎక్కువగా ఉందని ఆర్థిక సేవల పరిశోధన విభాగం అధిపతి సురేష్ గణపతి నివేదికలో తెలిపారు. ఆర్‌బిఐ వ్యక్తిగత రుణాల పరిధిని ఎత్తివేసిన తర్వాత మధ్యతరగతి వారికి బకాయిలు చెల్లించడానికి పరిమిత ఎంపికలు మిగిలిపోయాయని, ఇది పట్టణ ప్రాంతాల్లో మాంద్యం ఏర్పడిందని గణపతి చెప్పారు.

**పండుగల సమయంలో వినియోగదారుల ఖర్చు పెరిగింది:** ఆగస్టులో 1.6% ఉన్న లావాదేవీల వృద్ధి రేటు సెప్టెంబర్‌లో 0.5%కి తగ్గిందని ఆర్‌బిఐ డేటా చూపుతోంది. అయితే, పండుగ సీజన్‌లో వినియోగదారుల వ్యయం పెరిగింది. ఫలితంగా మొత్తం క్రెడిట్ కార్డ్ ఖర్చు ఆగస్టులో రూ. 1.69 లక్షల కోట్ల నుండి సెప్టెంబర్‌లో రూ. 1.77 లక్షల కోట్లకు పెరిగింది. ఇది ఏడాది ప్రాతిపదికన 23.8% పెరుగుదల.

### డిఫాల్ట్ ఎందుకు పెరుగుతోంది?

యువత తరచుగా వారి మొత్తం క్రెడిట్ పరిమితిని ఉపయోగించుకుంటాయి. ఫలితంగా డిఫాల్ట్‌లు పెరుగుతాయని, అనేక ఖాతాలు నాన్-పెర్ఫార్మింగ్ అసెట్స్ గా మారుతాయని నిపుణులు అంటున్నారు. అన్‌సెక్యూర్డ్ కన్స్యూమర్ లోన్‌లు ఇచ్చే సమయంలో జాగ్రత్తగా ఉండాలని బ్యాంకులు, ఎన్‌బిఎఫ్‌సిలను ఆర్‌బిఐ ఇటీవల ఆదేశించింది.

# జీరో డిప్రిసియేషన్ కార్ ఇన్సూరెన్స్? తో మీ కార్ సేఫ్.. అసలు ఇది ఎందుకు.?











జీరో డిప్రిసియేషన్ పాలసీలో నష్టానికి సంబంధించి పూర్తీ మొత్తం కవర్ అవుతుంది. ఎటువంటి తరుగుదల తీసివేయరు. పూర్తి క్లెయిమ్ పొందవచ్చు. కాంప్రహెన్సివ్ ఇన్సూరెన్స్ కవర్ తో పోలిస్తే జీరో డిప్రిసియేషన్ కార్ ఇన్సూరెన్స్ కాస్త భిన్నంగా ఉంటుంది.

**1 / 5**


జీరో డిప్రిసియేషన్ కార్ ఇన్సూరెన్స్ అంటే ఏమిటో తెలుసుకుందాం. కంప్రహేన్సివ్ ఇన్సూరెన్స్ కవర్ లో ఇన్సూరెన్స్ కంపెనీలు వాహనం ప్రస్తుత విలువ అంచనా వేసి క్లెయిం మొత్తాన్ని ఇస్తాయి. జీరో డిప్రిసియేషన్ కార్ ఇన్సూరెన్స్ అంటే ఏమిటో తెలుసుకుందాం. కంప్రహేన్సివ్ ఇన్సూరెన్స్ కవర్ లో ఇన్సూరెన్స్ కంపెనీలు వాహనం ప్రస్తుత విలువ అంచనా వేసి క్లెయిం మొత్తాన్ని ఇస్తాయి.

కాంప్రహెన్సివ్ ఇన్సూరెన్స్ కవర్ తో పోలిస్తే జీరో డిప్రిసియేషన్ కార్ ఇన్సూరెన్స్ కాస్త భిన్నంగా ఉంటుంది. జీరో డిప్రిసియేషన్ కార్ ఇన్సూరెన్స్ అంటే ఏమిటో తెలుసుకుందాం.కంప్రహేన్సివ్ ఇన్సూరెన్స్ కవర్ లో ఇన్సూరెన్స్ కంపెనీలు వాహనం ప్రస్తుత విలువ అంచనా వేసి క్లెయిం మొత్తాన్ని ఇస్తాయి. అంటే తరుగుదలను తీసివేసి విలువ కడతాయి. ఈ విధానంలో క్లెయిమ్ 75% మాత్రమె వస్తుంది. జీరో డిప్రిసియేషన్ పాలసీలో నష్టానికి సంబంధించి పూర్తీ మొత్తం కవర్ అవుతుంది. ఎటువంటి తరుగుదల తీసివేయరు. పూర్తి క్లెయిమ్ పొందవచ్చు. కాంప్రహెన్సివ్ ఇన్సూరెన్స్ కవర్ తో పోలిస్తే జీరో డిప్రిసియేషన్ కార్ ఇన్సూరెన్స్ కాస్త భిన్నంగా ఉంటుంది.

**2 / 5**

అంటే తరుగుదలను తీసివేసి విలువ కడతాయి. ఈ విధానంలో క్లెయిమ్ 75% మాత్రమె వస్తుంది. అదే జీరో డిప్రిసియేషన్ పాలసీలో నష్టానికి సంబంధించి పూర్తీ మొత్తం కవర్ అవుతుంది. అంటే తరుగుదలను తీసివేసి విలువ కడతాయి. ఈ విధానంలో క్లెయిమ్ 75% మాత్రమె వస్తుంది. అదే జీరో డిప్రిసియేషన్ పాలసీలో నష్టానికి సంబంధించి పూర్తీ మొత్తం కవర్ అవుతుంది.

**3 / 5**



ఎటువంటి తరుగుదల తీసివేయరు. పూర్తి క్లెయిమ్ పొందవచ్చు. అయితే, దీనికి ప్రీమియం ఎక్కువ ఉంటుంది. సాధారణ కవర్ కంటే 20-25% ఎక్కువ ఉంటుంది.హై-ఎండ్, మిడ్-సిగ్మేంట్ కార్లకు ఈ పాలసీ మంచిది. ఎటువంటి తరుగుదల తీసివేయరు. పూర్తి క్లెయిమ్ పొందవచ్చు. అయితే, దీనికి ప్రీమియం ఎక్కువ ఉంటుంది. సాధారణ కవర్ కంటే 20-25% ఎక్కువ ఉంటుంది.హై-ఎండ్, మిడ్-సిగ్మేంట్ కార్లకు ఈ పాలసీ మంచిది.

**4 / 5**

అలాగే చాలామంది ఈ రెండూ కాకుండా థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ తీసుకుంటారుఇది పేరుకే తప్ప.. ఎటువంటి బెనిఫిట్స్ ఇవ్వదువీలైనంత వరకూ జీరో డిప్రిసియేషన్ కార్ ఇన్సూరెన్స్ లేదా కాంప్రహెన్సివ్ ఇన్సూరెన్స్ తీసుకోవడం మంచిది. అలాగే చాలామంది ఈ రెండూ కాకుండా థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ తీసుకుంటారుఇది పేరుకే తప్ప.. ఎటువంటి బెనిఫిట్స్ ఇవ్వదువీలైనంత వరకూ జీరో డిప్రిసియేషన్ కార్ ఇన్సూరెన్స్ లేదా కాంప్రహెన్సివ్ ఇన్సూరెన్స్ తీసుకోవడం మంచిది.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com